కథానిక:

# ★ కవల పిల్లలు ★

— శ్రీ హరికిషన్

సుందరి పేరుకు మాత్రమే సుందరి కాదు. ఆమె సహజసౌందర్యమూ, ఆత్మ సౌందర్యమూ కల యువతి. ఊహలు జాస్తి. పెద్దవాళ్ళ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే తరహా కలది. స్కూలుఫైనల్ పరీక్ష ప్యాసయింది. ఇంకా చదువెందుకని తల్లిదండ్రులు చదువు మాన్పించారు.

వైశాఖమాసపు వడగాడ్పులతో బాటుగా పెళ్ళిళ్ళు కూడా ముమ్మరంగా సాగుతున్నయ్యి. ఆ వైశాఖమాసంలోనే సుందరి పెత్తల్లి కూతురు పెళ్లి. తల్లిదండ్రులతో పాటు సుందరికూడా హైదరాబాదు పెళ్లికి వెళ్ళింది.

విశాలాక్షి సుందరి పెత్తల్లికూతురు. ఆఅమ్మాయిదే పెళ్ళి. సుందరికన్న రెండేళ్లు పెద్ద.

లగ్నం అయిపోయింది. బాజాభజంత్రీలతో అందరి చెవులూ మారుమ్రోగగా, గుండెలు జలదరిస్తూ ఆనందంవెల్లివిరియగా నూతన వధూవరులు తలంబ్రాలు పోసుకున్నారు.

అమ్మలక్కలందరూ జడలు వేసుకుంటూ పెళ్ళి పందిట్లో కూర్చున్నారు. సుందరికూడా వాళ్ళల్లోచేరి వాళ్ళ కబుర్లు వింటూ కూర్చుంది. అక్కడే కూర్చున్న సుందరి అమ్మమ్మ "ఏమే సుందరీ విశాలాక్షి పప్పన్నం అయింది. నీపప్పన్నం ఎప్పుడు పెట్టిస్తావే" అన్నది. సుందరి ఏమీ మాట్లాడకుండా నవ్వి ఊరుకుంది. ఇంతలోనే సుందరి మేనత్త అందుకుని "అవునుగానీ అత్తయ్యా వియ్యపురాలి మాటలు విన్నావా. మూణ్ణిద్రలకొచ్చినప్పుడే ఆ అడ్డుకూడా తీర్చేసుకుని విశాలక్షిని తీసుకుపోతార్ట. అయినా యిదేం విడ్డూరం అత్తయ్యా మనకుటుంబాల్లో యింత పచ్చికలి ఉందా చెప్పు" అన్నది.

"కాపురం చేసుకుని వాళ్ళపిల్లని వాళ్ళు తీసుకు పోతామంటే మధ్యన మనం కాదంటే ఏంబాగుంటుందే. అదీకాక అదీ పెద్ద పిల్లేకదా, యింకా ఆగటం ఎందుకు" అన్నది యింకో ఆవిడ.

"అదేకాదు పిన్నీ నేననేది. ఏకడుపో కాలో వచ్చి సంవత్సరంలోనే మూడు తలకాయలు వూపితే అది అక్షేపణ కదూ! ఆ మాత్రం ఆలోచన లేకపోతే ఎట్లా" అన్నది సుందరి మేనత్త మళ్ళీ.

"ఆ మాట నిజమేననుకో. అయినా ఆ యిది వాళ్ళకుండాలిగాని మనం చెపితే వింటారా. ఆ అనవాయితీ వాళ్ళకి తెలీదేమో" అన్నది సుందరి అమ్మమ్మ.

"తెలీకపోతే తెల్సుకోవాలి. మన శేషమ్మత్త కూతురికి యిట్లాగే పెళ్ళిలోనే కాపురంచేసి పంపిస్తే సంవత్సరానికే పిల్లాడు పుట్టాడు. ఆ పుట్టిన పిల్లాడు పోయాడు. దానికి చచ్చేటంత జబ్బు చేసింది. వాళ్ళకి తెలీనప్పుడు మనం చెప్పాలి" అన్నది మళ్ళీ సుందరి మేనత్త.

అంతలోనే మేజువాణికి అంతా రమ్మనటం నుంచి ఆ మాటలు ఆపేసి అంతా లేచారు.

ఈ మాటలన్నీ సుందరి విన్నది. నవ్వుకున్నది. మనస్సులో అనేక ఆలోచనలూ, ఊహలు వాటంతటవ్వే దొర్లుకుపోయినట్లు ఆరోజంతా ఆలోచిస్తునే ఉంది సుందరి. విశాలక్ష్మి అంటే సుందరికి అమితమయిన ప్రేమ. అమ్మలక్కలు చెప్పిన కబుర్లనిబట్టి అంతా ఊహించుకుంది.

ఆ రాత్రి అప్పగింతయి పోయినయ్యి పెళ్ళికూతుర్ని తీసుకుని పెళ్ళివారు మూణ్ణిద్రలకు వెళ్ళారు. అక్కడ మూణ్ణిద్రలయి పోయింతరువాత మళ్ళీ నిద్రలకొచ్చినప్పుడే పునస్సంధానం కూడా అయిపోయింది. విశాలక్ష్మిమీద ఏదో చెప్పలేని కోపం వచ్చింది సుందరికి. విశాలక్ష్మి అత్తవారింటికి వెళ్ళింది. సుందరి తల్లిదండ్రులతోబాటు తమ ఊరు వచ్చేసింది.

ఆ శ్రావణ మాసంలోనే సుందరి పెళ్ళి నిశ్చయించారు. వరుడు ఇంజనీరు. ఆ సంబంధానికి సుందరికూడా యిష్టపడింది. ముహూర్తం నిశ్చయించారు. పెళ్ళయింది. పడిదిరోజులు పెళ్ళికూతుర్ని తీసుకెళ్ళి మేజువాణీ చేసుకుంటూ వున్నారు. పెళ్ళికొడుకువైపువాళ్ళు చక్కగా పూలజడ వేసింది సుందరి పినతల్లి. తన పొడుగాటి జడను చూసుకుని సుందరి నవ్వుకుంది.

"పిన్నీ విశాలక్ష్మి అక్కయ్య జడకన్న నా జడ చాలా పెద్దది కదూ. దాని పెళ్ళిలో చూశాను. నా జడకన్న చాలా చిన్న జడ" అన్నది.

"అయితే నీ జడతో ఏం చేస్తావ్" అంది పినతల్లి.

"జడతో ఏం చేస్తాను పిన్నీ. ఆడవాళ్ళకు అదీ పెద్ద అలంకారం. నా పూలజడ చూసుకుంటే నేనే గర్వపడుతున్నాను. అనుకోవటడముగాని" అన్నది సుందరి.

అంతలోనే సుందరి చిన్న మేనత్తవచ్చి అంత పెద్ద పొడుగాటి జడతో ఏం చేస్తావే పిల్లా" అన్నది.

"జడతో ఏం చేస్తానో నాకేం తెలీదు."

"యిప్పుడేం తెలుస్తుందిలే. సరిగ్గా యివాల్టికి నాలుగు రోజులు పోయాక అదే తెలుస్తుంది. గదిలో ఆ జడతో మీఆయన్ని మృదువుగా కొట్టాలి" అన్నది పెద్దమేనత్త. పెద్ద వాళ్ళంతా నవ్వుకున్నారు. సుందరి సిగ్గుపడింది కాని అంతలోనే ఎందుకో గుండె ఝల్లుమనిపించింది. ఏ బాధిలోపలే....

పెళ్ళికొడుకు తల్లి వియ్యపురాల్ని అడిగింది వాళ్ళబ్బాయి యింజనీరు చేస్తూ, వేళకు తిండీ తిప్పలూ లేకుండా ఆ హోటలు భోజనం పడక అవస్థ పడుతున్నాడనీ ఆ అడ్డు తీర్చేస్తే కోడల్ని కాపరానికి

తీసుకు వెళతామనీ చెప్పింది. ఈ విషయం సుందరి చెవిని కూడా పడ్డది. ఆ రోజున విశాలక్ష్మి పెళ్ళికి వెళ్ళినప్పుడు పెద్దవాళ్ళు చెప్పుకున్న విషయాలు బాగా మనస్సులో నాటుకు పోతున్నయ్యి. భర్త సాన్నిధ్యానికి వెళ్ళటానికి తనూ ఆరాటపడుతున్నా ఆ భావం మాత్రం సుందరి మనస్సులో నుంచి తొలిగిపోలేదు. అప్పటికి విశాలక్ష్మి కాపురానికివెళ్ళి నాలుగు నెల్లయింది. విశాలక్ష్మి ఎట్లా వుందో సుందరికి తెలీలేదు.

పెద్దల నిర్ణయానికి ఎట్లా అడ్డుచెప్తుంది. ఏమీ తోచలేదు. మనస్సులో ఆందోళన.

అప్పగింతలయిపోయినయ్యి. సుందరిని మూడు నిద్రలకు తీసుకెళ్ళారు, సుందరితో కూడా రెండో మేనత్త తోడువెళ్ళింది. తన అనుమానాన్ని మేనత్తతో చెపుదామనుకుంది. కాని ఎట్లా చెప్పేందుకూ, ఏం చెప్పేందుకూ సిగ్గు. అదీకాక హేళన చేస్తారేమోనని భయం.

మేనత్త స్నానానికి వెళ్ళిన సమయంలో మెల్లిగా తన పెట్టెతీసి కలం కాగితం తీసుకుంది. క్లుప్తంగా చిన్న ఉత్తరం రాసింది. ముందుగదిలో సుందరి భర్త ఈజీచైర్లో పడుకుని ఏదో చదువుకుంటున్నాడు, ఎవ్వరూ చూడకుండా ఒక్క క్షణంలో ఉత్తరం అతని మీద పడేసింది. సుందరి భర్త మోహన్‌రావు ఉలిక్కిపడి చూచాడు వరండాలోనుంచి సుందరి నవ్వుకుంటూ తలొంచుకుని, వెళ్ళిపోయింది. గుండెల మీద పడిన కాగితం మడతవిప్పి చదువుకున్నాడు. అతనికి పట్టరాని నవ్వొచ్చింది. సుందరిలోగల మానసిక పరిణామాన్ని పెద్దల మాటలు లక్ష్యపెట్టే విధానాన్ని అన్నీ మనస్సులో ఊహించుకుని మళ్ళీ నవ్వుకున్నాడు. ఉత్తరాన్ని మరొకసారి చదువుకున్నాడు.

పూజ్యులైన భర్తగార్కి,

నమస్కారములు. నన్ను మీరు వెంటనే కాపురానికి తీస్కువెళ్తారని విని చాలా సంతోషించినాను. పెద్దల అనుభవాల మీద ఆచారాలమీద నాకు కొంచం పిచ్చి నమ్మకాలున్నాయి. ఏడాదిలోపలే మూడు తలలు కూడితే అదొక తప్పుగా పెద్దలు చెప్పుకోవటంచేత కనీసం నాలుగయిదు నెల్లు మనం బ్రహ్మచర్యం అవలంబిస్తే బాగుంటుందేమో. తరువాత మీ యిష్టం. మరేమీ కారణంలేదు, అంతా వూహించగలరని అనుకుంటాను.

మీ చరణదాసి

*సుందరి.*

ఆ రాత్రి తల్లితో చెప్పాడు మోహనరావు. తనకు తొందరపన్లు ఉన్నాయని, శలవులేదనీ, సుందరిని కాపురానికి తీసుకు వెళ్ళటానికి నాలుగయిదు నెల్లవరకూ వీలుకాదనీ, ఆవిడ నిర్ఘాంతపోయింది. "అదేవిటా! ఈ మూడు నిద్రలకి వెళ్ళినప్పుడే ఆ ఆటంకం కూడా తీరిస్తే పోతుందని మీ అత్తారితో చెప్పొచ్చానురా. వాళ్ళు ప్రయత్నంమీద కూడా ఉంటామని చెప్పారు ఆహోటలు భోజనం పడవని నువ్వేకదురా పిల్లను తీస్కువెళతానని చెప్పింది. యింతలో మళ్ళీయిట్లా మాట్లాడతావేరా" అన్నదావిడ. "ఏమయినాకానీ అమ్మా యిప్పుడేంతొందర నాలుగయిదు నెల్లుపోనీ" అన్నాడు. ఆవిడకేమీ తెలీక, యింకేం మాట్లాడకుండా వూరుకుంది.

కాలగర్భంలో అయిదారునెల్లు గడిచినయ్యి. మాఘ మాసంలో పునస్సంధాన ముహూర్తం పెట్టుకున్నారు. సుందరి కూడా తన భర్త అప్పటి తన ఉత్తరాన్ని చదువుకుని తను చెప్పినటుగా చేసినందుకు మనస్సులో అనేక విధాల భర్తను ఆరాధించుకుంది.

ఆ రోజు రాత్రి సుందరిని మోహన్‌రావు అడిగాడు.

"నీ వ్రతసమాప్తి అయిందాదేవీ" అంటూ నవ్వాడు.

"వ్రతమేం లేదు లెండి. ఏదో పెద్దవాళ్ళ అనుభవం"

"అంటే తొందర్లోనే మనకు...." అంటూ దగ్గరకు తీసుకున్నాడు. సుందరి భర్త వళ్ళో వాలిపోయి" అది కాదు. మన ఉభయుల క్షేమానికి, ఆనందానికి అట్లా అనుకున్నాను. పాపం! అన్నెల్లు బ్రహ్మచర్యం పాటించాల్సొచ్చిందే" అన్నది. బుగ్గమీద చిటికవేసి.

"దేవిగారి ఆజ్ఞ" అంటూ సుందరిని మరింత హృదయానికి హత్తుకున్నాడు.

నాలుగు నెల్లు గడిచినయ్యి. సుందరికి వాంతులు ప్రారంభమయినయ్యి. సుందరితో అన్నాడు మోహనరావు. 'దేవిగారు అనుకున్నంత పనీ చేశారన్నమాట. ఈ ఆనవాయితీ తప్పనిస్తే కనీసం అయిదేళ్ళయినా మూడు తలలు ఏర్పడనవి నేననుకున్నాను. మీ ఆడవాళ్ళు ఎంతనుకుంటె అంత'

సుందరి నవ్వుకుంది 'పెళ్ళయిన ఏడాది లోపల మూడు తలలు ఏర్పడకూడదన్నారుగాని అసలు పిల్లలు పుట్టకూడదని చెప్పలేదు కదా' అన్నది నవ్వి.

సుందర్ని పురిటికి తీసుకెళ్లారు తల్లిదండ్రులు. కాన్పు కష్టమయినా ఆణిముత్యాల్లాంటి యిద్దరు కవల పిల్లలు మొగ పిల్లల్ని కన్నది సుందరి. తల్లి పిల్లలు క్షేమంగా ఉన్నారు.

మూడోమాసం రాగానే మోహనరావు వచ్చి భార్యా పిల్లల్ని తమ ఊరు తీసుకు వెళ్లాడు.

సుందరి పిల్లనిద్దరికీ పాలుపట్టి ఉయ్యాలలో యిద్దర్నీ పడుకోబెట్టింది. వాళ్లు హాయిగా అదమరిచి పడుకున్నారు.

"సుందరీ"

వెనక్కు తిరిగి చూసింది సుందరి. భర్త మోహనరావు.

"ఎందుకండీ"

"ఏడాది లోపల మూడుతలలు కూడగూడదని పెద్ద నాపసానిలా ఉత్తరంరాసావు కామాలకకుని, అన్నెల్లు వివాహిత, బ్రహ్మచర్యం అవలంబించాను. కాని ఏడాది వెళ్లింతరువాత నాలుగు తలలు కూడినయ్యి. ఆలస్యమైన కొద్దీ కవల

(తరువాయి 29 వ పేజీలో)

## వసంత

(14 వ పేజీ తరువాయి)

అవ్యక్తంగా ఏవేవో ఆలోచనలు సుడులు తిరిగాయి, మళ్ళీ వివాహం చేసికొని వసంత స్థానాన్ని మరోవ్యక్తి కివ్వడమా? హృదయం అయిష్టంగా మూలిగింది తనలో వసంతకి తప్ప మరెవ్వరికీ స్థానంలేదంది.

మర్నాడు నా నిర్ణయాన్ని అమ్మతో చెప్పేశాను. నా బాధను అర్థం చేసుకున్నాడు కాబోలు నాన్న మళ్ళీ ఆ విషయం కదపలేదు. పసివాడిలో వసంతి ప్రతిరూపం చూసుకొంటూ ఓ రకమైన సంతృప్తితో కాలం వెళ్ళబుచ్చుతున్నాను.

ఆలోచనా స్రవంతిలోంచి బాహ్యస్మృతిలో కొచ్చేసరికి చీకటి పడుతోంది. మెల్లగాలేచి ఇంటివైపు బయలు దేరాను.

పిల్లవాడు ఉయ్యాలలో ఊగుతున్నాడు. ఉయ్యాల దగ్గర కెళ్ళాను, వాడి చిన్నారి పెదవులమీద చిరునవ్వు నాట్యం చేస్తోంది. ఆ ముఖం అచ్చం వసంత ముఖంలాగే ఉంది.

గదిలోకెళ్ళాను. టేబిల్ వద్ద కెళ్ళి దాని మీదున్న పూలదండ అందుకొని ఎదురుగా గోడమీద వేలాడుతూన్న వసంతి ఫోటోకి తగిలించాను. చెమ్మగిల్లిన కళ్ళలోంచి ఓ అశ్రుబిందువు రాలి నేలమీద పడింది. అలవాటు పడినట్లుగా ఆ పృధివి ఆ బిందువును తన హృదయంలో దాచుకొంది.

—o—

## నవ్వనా? ఏడ్వనా?

(18 వ పేజీ తరువాయి)

చేయవలసి వచ్చింది. అయినా లాభంలేకపోయిందే!" అని విచారిస్తున్నాడు.

అప్లికేషను ఇచ్చేటప్పుడు అతనికి ముఖంలో నుండి ఆశా కిరణాలు తొంగి చూస్తూ కన్పించాయి. తనేముందు వాడవిన్నీ, తన కంటే ముందు ఇంకెవ్వరూ ఇచ్చే అవకాశం లేదనిన్నీ అతడు ఆశించాడు. దానికి తోడు ఆయనతో పరిచయం ఉన్న నా వంటి మిత్రుడు దొరికినందుకు మరీ సంతోషించాడు. కాని లాభం శూన్యం.

లోకంలోని మనుష్యులు, మనస్తత్వాలూ చూస్తే నా కాశ్చర్యం వేసింది. ఆయన మరణించి రెండు గంటలన్నా పూర్తికాలేదు, కాని ఆయన జాగా పూర్తయిపోయింది, కొత్తవాళ్ళు భర్తీ అయ్యేరు. ఇంకా నయం, ఆయన జబ్బుగా ఉండగానే అప్లికేషన్లు దాఖలు చెయ్యలేదు, అంచేత లోకంలోని మనుష్యులు స్వార్థపరులేకాని, ఆయన చావకుండా అప్లికేషను దాఖలు చేసే అంత నీచులు కాలేదు. దానికి కొంచెం సంతోషించాలి. ఇదంతా చూస్తూ ఉంటే నా మదిలో మరొక మారు ఈ ప్రశ్న ఉదయించింది. "నవ్వనా? ఏడ్వనా?"

(హిందీ మాతృక ఆధారంగా)

## ఆకాశవాణి

(17వ పేజీ తరువాయి)

ఇంజనీరింగు ప్యాసై ఉద్యోగం చేసుకుంటూ ఉంటూ ఉండగా తండ్రి లంచగొండితనం తెలుసుకొని ఉద్యోగానికి సెలవో రాజీనామాయోపెట్టి, పుట్టింటికొచ్చి బండివాడికి రూపాయిప్పించి స్నానంచేసి కాఫీ త్రాగి, నాన్నగారు సి. ఐ. డీ పాలుగాక నాన్నా నాన్నా అని అంగలార్చే స్త్రీ పాత్ర ఈలాటి నాటికలో తప్ప మరెక్కడా మచ్చుకైనా కనిపించదు. ఇతివృత్తం సన్నివేశాలు, సంభాషణ పాత్ర పోషణ ఏదీ కూడా నాటకం అనిపించుకునే స్థాయికి రాలేదు. నటన బాగుంది.

## కవల పిల్లలు

(18 వ పేజీ తరువాయి)

పిల్లలు పుడతారన్నమాట" అన్నాడు నవ్వుతూ.

"నేనూ అదే అనుకుంటున్నాను మూడు తలలుపోయి, నాలుగు తలలు ఏర్పడ్డయ్యాని" అన్నది సుందరికూడా నవ్వి

"అందుకే శాస్త్ర సమ్మతంగా......"

"ఇంకా చాలించండి మీకబుర్లు మీరును పెద్దవాళ్ళయినకొద్దీ...." అన్నది చిలిపిగా నవ్వుతూ.

సుందరి చెయ్యి పట్టుకుని పెదవులు స్పృశించబోయాడు మోహన్‌రావు. అంతలోనే కవలపిల్లలు క్యారు మన్నారు.

## సాహిత్యార్ణవం

(18 వ పేజీ తరువాయి)

వర్ణాన్ని చిత్రించి, ఒక పది సమావేశాలు సాధించలేని ప్రయోజనాన్ని సాధించారు. రవీంద్రుని స్మృతి, వారి కీర్తి చిరకాలం ఉండిపోయే కృషి చేశారు.

శ్రీ అబ్బూరి గోపాల కృష్ణగారికి మా అభినందనలు.

భయపడకండి

పోలియో అను పిలువబడు స్నాయువాతం చూసి భయపడకండి.

ఆయుర్వేద పద్ధతులలో గ్యారంటీగా కుదర్చ గలం.

ఇప్పటికే ఎన్నో కేసులు కుదిర్చాం.

వివరములకు:

శ్రీ లక్ష్మీ నృసింహ
ఆయుర్వేద వైద్యశాల
మచిలీపట్నం.